# దీపం చెప్పిన కతలు

# పొద్దుచాలని మనిషి

గోపిని కరుణాకర్

పలపలా చినుకులు రాలినాయి.

మెట్లమింద కుర్చోనుండే దీపాలు వుడ్డగా పైకిలేచి మూలస్తానమ్మ గుళ్ళోకి పొయినాయి.

కొన్ని దీపాలు అరుగులమింద కుర్చున్నాయి. కొన్ని నేలమింద కుర్చున్నాయి. కొన్ని గడపలమింద, పడిపోయిన రాతికూసాల మింద కుర్చున్నాయి. వాన ఊపందుకునింది. చిటపటమని చినుకులు చిందులేస్తా వుండాయి.

దీపాలు గాలికి తలలూపతా వుంటే వాటి నీడలు గుడి గోడల మింద కదలాడతా వుండాయి.

ఆ నీడల్ని చూస్తా,

''అక్కా... దేవుడు మనిషిని పుట్టించి, మనిషితో పాటు నీడనెందుకు పుట్టించినట్టో?'' అని అడిగింది దిగవింటి దీపం.

''నీడంటే కర్మసాక్షి గదా! మనిషి పాపం చేసినా, పుణ్యం చేసినా, వొళ్ళొంచి కష్టం చేసినా, సోమరిపోతుగా జీవించినా మనిషి వెనకాలే తిరగతా కాపెట్టుకోనే వుంటుంది. రేపు మనిషి సచ్చిపొయ్యి దేవుని దెగ్గిరికి పోతే, పాపపుణ్యాలని విచారించేటప్పుడు మనిషి అపద్దం చెప్పినా నీడ అపద్దం చెప్పదు. నీడ చెప్పిన సాక్ష్యాల ఆధారంగా వాడుచేసిన కర్మను బట్టి స్వర్గనరకాలను నిర్ణయిస్తాడు దేవుడు'' అని



చెప్పింది బృందావన దీపం.

ఈ బృందావన దీపాన్ని ఇంట్లో తులసికోట వద్ద పెడతారు.

"కర్మసాక్షి గురించి ఎంత బాగా చెప్పావే బృందావన! ఆ నోటితోనే ఓ మంచి కత చెప్పు?" అని అడిగింది పెద్దింటి దీపం.

కత చెప్పమన్నట్టు మిగతా దీపాలు బృందావన దీపం వైపు చూసినాయి.

"పొద్దు చాలని మనిషి కత చెప్తాను మీకు" అని రెపరెపమని తలాడిస్తా కతనెత్తుకునింది బృందావన దీపం.

* * *

చిన్నవ్వ పొద్దు మొలవకముందే లేసి మొగిలి గోడ మింద మొద్దునిద్దర పోతా వుండే కోడిపుంజును లేపింది.

అది ఉలిక్కిపడి లేచి రెక్కల్ని రెపరెపలాడించి "కొక్కరకోకో కొక్కరకోకో" అని గొంతు చించుకుంటా పల్లెని లేపింది.

చిన్నవ్వ లేస్తానే సుబ్రమన్నెస్వామికి, మూలస్తానమ్మకి దండం పెట్టుకునింది. అరిచేతుల్ని రుద్ది వెచ్చ చేసుకోని పైకి లేచింది.

కిరసనాయిలు బుడ్డీ వెలిగించింది.

ఆపాట్నే ఇంటెనక్కుపొయ్యి మొగం కడుక్కోని, నోట్లో నీళ్ళు పోసుకోని పుక్కిలించింది. బుడ్డీ ఎలతర్లో తీరిగ్గా, ఎంతో ఇష్టంగా వక్కాకు వేసుకునింది.

ఆపాట్నే చేటడు సద్దలు రోట్లో పోసి, పిండి ఎగిరిపోకుండా కుదురుపెట్టి రోకలి తీసుకోని, "దభీ గుభీ మని" పోటేస్తా దంచతా వుండాది.

ఆ పోటుకి దుప్పట్లో ముడుక్కోని నిద్దరపోతా వుండే పెదబ్బకి మెలుకువ వచ్చింది. లేస్తే పుస్తకం చేతపట్టాల్సి వస్తుందని చెప్పి ఆ పక్కకు తిరుక్కోని మల్లా వెచ్చగా ముడుకొన్నెడు.

సద్దల్ని పొట్టూడగొట్టి పిండి కొట్టింది. చేటతో చెరిగి పిండిని నూకని వేరుచేసింది.

ఆపాట్నే గొడ్లను తీసి బయట కట్టేసింది. గొడ్ల కొట్టాంల్లోని పేడచెత్తా పుడకలకెత్తి పల్లెముందుండే దిబ్బలో పోసింది. గొడ్లు పోసిన పంచితాన్ని గోలెంలోకి పిండుకోని బీటి చెన్లో ఎగరజల్లేసి వచ్చింది.

నీళ్ళ కాగులో పేన్నీళ్ళు కలిపింది. ఇంటిముందు పేన్నీళ్ళు జల్లి ముక్కర్రేసింది.

ఆపాటికి తూరుపున పటమెగిరింది.

"ఈ పంపు (దెయ్యం) ఎప్పుడు లేసిందమ్మా తల్లే! అప్పుడే ముక్కర్రగూడా ఏసేసింది" అని అంటా బిందెని సంకనపెట్టుకోని చేదబాయి కాడికి పాయింది సక్కు పిన్నమ్మ.

అప్పటికే చేద బాయికాడ రెండు రాట్నాలు కిర్రు కిర్రని తిరగతా వుండాయి. రామాంజులు వొదిన, బొజ్జత్త నీళ్ళు చేదతా వుండారు.

కాకులు 'కావు కావుమని' అరస్తా గంగనాగోలగా చింతమాకుల మింద ఎగరతా వుండాయి.

గొర్రెల తాత లేసి బీడీ ముట్టించినాడు. అనుమంతునాయుడు లేసి నీళ్ళు పారగట్టేదానికి మడికాడికి పాయినాడు. బీడీ తాగేసి మడకా, కాడిమాను బుజాన పెట్టుకుని, ఎద్దల్ని తోలుకోని మిరప తోటకి గెడ్డలు తోలేదానికి పాయినాడు గొర్రెలతాత.

దూడని వొదిలింది చిన్నవ్వ. అది పరిగెత్తు కుంటా పొయ్యి పెద్దావు పొదుగు గుద్దిగుద్దీ పాలు తాగతా వుండాది. సేపుకొచ్చినాక తీసి పక్కన కట్టేసింది.

మోకాళ్ళమింద కుర్చునింది. గుండు చెంబుని కాళ్ళమద్దెన పెట్టుకోని 'సిరుక్కు బురుక్కుమని' పాలు పిండతా వుండాది.

పెద్దావు మోర పైకెత్తి సగించినట్టు నిలబడుకోని వుండాది. దూడ ఆవుగంగడోలు నాకతా వున్నింది.

ఇంతలో,

చేదబాయికాడ నీళ్ళు చేదతా చేదతా ఎర్రని పొద్దుని గూడా చేది బయటేసింది సక్కు పిన్నమ్మ.

ఎర్రని పొద్దు చిన్నవ్వని చూసి కుళ్ళి సచ్చింది.

పొద్దుని చూసి చిన్నవ్వ నవ్వతా కులికిసచ్చింది.

"ఏంవా.. పొద్దుని చూసి నవ్వతా వుండావు?" అని అడిగినాడు.

"పొద్దుది కుక్క శాస్త్రం పెదబ్బా!" అనింది పాలు పిండతానే చిన్నవ్వ.

"కుక్క శాస్త్రమంటే ఏందివా?" అని అడిగినాడు.

"ఒగ ఊళ్ళో ఒగ కుక్క వున్నిందంట పెదబ్బా! చలికాలంలో చలికి వొణికొణికి సచ్చిపోతా వున్నింది. రాత్తిరి పొణుకునే ముందు అనుకునేదంట. ఎట్లయినా సరే రేపు పొద్దున్నే లేస్తానే మడిచెరువు సంతకు పొయ్యి దుప్పటి కొనుక్కోవల్లని. పొద్దున్నే లేస్తానే ఎచ్చెచ్చగా నీరెండ తగిలేసరికి దుప్పటి విషయం మరిచిపొయ్యేది".

**గొర్రెల తాత లేసి బీడీ ముట్టించినాడు. అనుమంతునాయుడు లేసి నీళ్ళు పారగట్టేదానికి మడికాడికి పాయినాడు. బీడీ తాగేసి మడకా, కాడిమాను బుజాన పెట్టుకుని, ఎద్దల్ని తోలుకోని మిరప తోటకి గెడ్డలు తోలేదానికి పాయినాడు గొర్రెలతాత.**

"రాత్తిరయితే మల్లా మామూలే! రేపు ఎట్లయినా సరే పీలేరు సంతకు పొయ్యి దుప్పటి కొనుక్కుంటాను సామి. లేకపోతే చలికి చచ్చిపొయ్యేట్టు వుండాను అని అనుకొనేదంట. ప్రతిదినం సంతలు పోతానే వుండాయి. వస్తానే వుండాయి. కుక్క దుప్పటి కొనుక్కోకుండానే చలికాలం యలబారిపొయింది. దీన్నే కుక్కశాస్త్రమంటారు".

"ఈపొద్దు గూడా మాపటేల గూకేటప్పుడు అనుకుంటుంది. ఎట్లయినా సరే రేపు పొద్దున్నే ఈ ముసలిదానికంటే ముందు లెయ్యాలి అని. తీరా లేసా చేసరికి నేను ముక్కర్ర ఏస్తానో, పాలు పిండతానో వుంటాను" అని చెప్పి నవ్వింది చిన్నవ్వ.

పెదబ్బ పొద్దుకల్లా చూసి భలే నవ్వినాడు.

గుండు చెంబునిండా పాలుపిండి మల్లా దూడని వొదిలింది పాలు తాగేదానికి.

అప్పుడు లేసి పాలచెంబుని అందుకునింది కల్లేణమ్మ.

ఆపాట్నే బిందెత్తుకోని చేదబాయికాడికి పొయింది చిన్నవ్వ. చేదబాయి కాన్నుంచి ఇంటికీ, ఇంటినుంచి చేదబాయి కాడికి 'గ్గిరుబుర్రుమని' తిరగతా ఇంటెనక తొట్టెల్ని, నీళ్ళకాగుల్ని, ఇంట్లో రాగి అండాలను నీళ్ళతో నింపేసింది.

కల్లేణమ్మ పొయ్యి ముట్టించి సంగటి సట్టి ఎక్కించింది.

చిన్నవ్వ కారం, మసాలాలు నూరిచ్చింది. కూరగాయలు, ఎర్రగడ్డలు తరిగిచ్చింది.

ఇంగొక పొయ్యి ముట్టించి నీళ్ళ కాగు పెట్టింది. నీళ్ళు కాంచి ముగ్గురి పిల్లోల్లకు పోసింది. గుడ్డలు తొడిగింది. తల దువ్వింది. వసంతకు ఎద్దుకొమ్ము ల్లాగా నెత్తిమింద బిగదీసి రెండు జెళ్ళేసి పూలు పెట్టింది. కళ్ళకు కాటిక దిద్ది, బుగ్గన సాదు చుక్క పెట్టింది.

పిల్లోల్లకి గిన్నెల్లో సద్దుడుకుపోసింది. దుత్తలో చేతిని ముంచి మీగడ పెరుగు వేసింది.

పెదబ్బకి సద్దుడుకంటే చానా ఇష్టం. వేళ్ళనీ, చేతినీ నాక్కుంటా ఆత్తరమాత్తరంగా తింటా వుండాడు.

ఆపాట్నే 'చిరుక్కు బురుక్కుమని' మజ్జిగ చిలికింది చిన్నవ్వ. వెన్న తీసింది. మురిగిపోకుండా అప్పుడు తీసిన వెన్నని అప్పుడే మూకుట్లో పోసి పొయ్యిమిందికి ఎక్కించింది.

చింత నిప్పుల మింద సన్నని సెగకి వెన్న కరిగి బుడగలొస్తా వున్నింది.

పెదబ్బ, పీరుగోడు, వసంత పొయ్యికాడ్నే కుర్చున్నారు.

వెన్నంతా కరిగిపొయ్యి గమగమా వాసనొచ్చేటప్పుడు పచ్చికరేపాకు వేసి దించింది. చల్లారినాక హార్లిక్సు సీసాలో వడగట్టింది.

అడుగుని పారబొయ్యకుండా ఆ మూకుట్లోనే రాగిపిండి, బెల్లం వేసి వేపి పిల్లోల్లకి పెట్టింది.

నెయ్యిలో వేగిన కరేపాకుతో సహా కరుంగు కరుంగుమని నమలతా రాగిపిండి బొక్కలాడతా వుంటే తియ్యతియ్యగా, కమ్మకమ్మగా, నేతివాసన పలవరిస్తా భలే వుంటుంది. తింటేనేగాని ఆ రుచి తెలీదు.

ఆపాట్నే చిన్నవ్వ బొగ్గుని కరకరా నమిలి పొండ్లు తోమింది. ఉడుకుడుగ్గా సంగటి తినింది. తొలికెత్తుకోని చెనిగి చేన్లో గడ్డి తవ్వేదానికి యలబారింది.

ఆపొద్దు బడికి సెలవు. పెదబ్బ, పీరుగోడు మేము గూడా వస్తామని వెంటపడినారు.

వాళ్ళ చేతులకి రెండు తొలికిలిచ్చి యలబారతా వుంటే వసంత గునగునా నడుచుకుంటా వచ్చి చిన్నవ్వ కాళ్ళకి అడ్డంపడింది.

నేను గూడా వస్తానని చెప్పి సైగచేస్తా మునికాళ్ళ మింద లేసి చేతులు చాపి ఏడ్చింది.

వసంతని ఎత్తుకోని,

"నువ్వు గూడా చెనిగి చెట్లు తవ్వేదానికి వస్తావా? గోపినింటి ఆడబిడ్డలకి పనంటే భలే అక్కర గదా!" అని ముద్దు పెట్టుకోని సంకనేసుకుని యలబారింది.

* * *

నీడల్ని తొక్కుంటా చెనిగి చేన్లో గెడ్డి తవ్వతా వుండారు చిన్నవ్వ, పెదబ్బ.

పీరుగోడు, వసంత సీతాకోకచిలకలతో ఆట్లాడు కుంటా వుండారు.

కందిపూల మింద వాలిన సీతాకోక చిలకల్ని 'హు డని' తరిమితే అవి గుంపుగా పైకిలేసి మల్లా ఎన్నిద పూలమింద వాలినాయి.

పెదబ్బ ఎత్తెత్తి అడుగులేస్తే నీడగూడా ఎత్తెత్తి అడుగులేస్తా వుండాది. కుంటతా నడిస్తే అది గూడా

కుంటతా నడస్తా వుండాది. కోతిమాదిరి గుర్రుగుర్రు మని ఎక్కిరిస్తే అదిగూడా అదేమాదిరి ఎక్కిరిస్తా వుండాది.

''అవా... చూడువా? నేను ఏమి చేస్తే అదంతా నీడగూడా చేస్తా ఉండాది'' అన్నేడు ఇచ్చిత్తరపోతా.

ఆమాటకి గెడ్డి తవ్వతా పకపకా నవ్వింది చిన్నవ్వ.

''నీడ మనవెంటనే నడస్తా, మనల్నే కాపెట్టుకోని వుండకుండా ఇంగ ఎక్కడికి పోతుంది?'' అనింది.

''ఎందుకు మనల్ని కాపెట్టుకోనుండేది?'' అని అడిగినాడు పెదబ్బ.

''ఎందుకా...? దానికొక కత వుండాదిలే!'' అనింది చిన్నవ్వ.

''ఆ కతేందో చెప్పవ్వా! పనిచేస్తా కత వింటా వుంటే అలుపుండదు'' అన్నేడు.

చిన్నవ్వ కతనెత్తుకునింది.

ఉత్తీత రైతుని పుట్టించినాక దేవుడు నీడని పిలిచి, ''నువ్వు రైతు వెంటనే వుండి కాపెట్టుకోనుండు. తప్పు చేసినా ఒప్పుచేసినా, కష్టపడినా సోమరిగా వున్నే ప్రతిరోజూ నాకొచ్చి చెప్పాలి'' అని చెప్పినాడు.

దేవుడు చెప్పినట్టే రైతుని కాపెట్టుకునే వున్నింది నీడ.

పొగులంతా వెంట నడస్తా, రాత్తిరి రైతు పడుకున్నప్పుడు దేవుని దెగ్గిరికి పొయ్యి ఆ పొద్దంతా ఏమేమి చేసినాడో చెప్పేది.

ఆపొద్దు భలే ఎండ కాస్తా వున్నింది.

మడక్కి దున్నీదున్నీ అలిసిపోయినాడు. మద్దేన్నం పెళ్ళాం సంగటి తెస్తే కడుపు నిండా తినేసరికి కంటినిండా నిద్దర పట్టేసింది. వొళ్ళు మరిచి పొయ్యి చెట్టునీడన పడుకోని నిద్దరపొయినాడు.

మడక కట్టిన ఎద్దులు నిలబడుకోని నెమరువేస్తా వుండాయి.

రైతు అట్టా పడుకోగానే నీడ ఏం చేసిందంటే నేరుగా దేవుని దెగ్గిరికి పొయింది.

''దేవరా దేవరా...? రైతు పని చెయ్యకుండా పట్ట పొగులే చెట్టుకింద పడుకోని నిద్దరపోతా వుండాడు'' అని చెప్పింది.

దేవుడికి వొళ్ళు మండిపోయింది. ఆపాట్నే దేవలోకం నుంచి పరిగెత్తుకుంటా వచ్చినాడు.

''లమిడీ... నిన్ను పుట్టించింది తిని పడుకోవడానికా? కష్టంచేసి పంటలు పండించి లోకాన్ని సాకతావని గదా!'' అని చెప్పి చెలాకోడి తీసుకోని నాలుగు పీకులు పీకినాడు.

ఆ దెబ్బతో ఉలిక్కిపడి లేసి కుర్చున్నాడు రైతు.

''అరెరే... ఎంత తప్పుచేసినాను. ఓపినంత పని పెట్టుకోని చెట్టుకింద పడుకోని నిద్దరపొయినానే'' అని చెప్పి లేసిపొయ్యి దుక్కిదున్నడం మొదలెట్టినాడు.

ఇంగొకరోజు ఏం జరిగిందంటే,

రైతు పగలంతా వొళ్ళొంచి ఎర్రని ఎండలో కష్టపడి కష్టపడి అలసిపొయినాడు.

వుడుకుడుగ్గా నీళ్ళు పోసుకున్నే నొప్పులు తగ్గలేదు. దానికితోడు గాలి ఆడక వుమ్మగిస్తా వున్నింది.

నిద్దర రాక పడకమింద మెదలతా వున్నేడు రైతు.

నీడ దేవుని దెగ్గిరికిపోయింది.

''దేవరా దేవరా...! రైతు ఈ పొద్దంతా భలే కష్టపడినాడు. నొప్పులకి అల్లాడతా నిద్దరగూడా పోలేదు'' అని చెప్పింది.

''అరెరే... నా రైతుకి నిద్దర రావడం లేదా?'' అని చెప్పేసి దిగులుపడిపొయ్యి దేవలోకం నుంచి పరిగెత్తుకుంటా వచ్చినాడు.

విసనకఱ్ఱ తీసుకోని కొంచేపు విసరతా పక్కన్నే కుర్చున్నాడు దేవుడు.

గాలి సల్లంగా రెక్కల్ని ఆడించింది. వింజామరతో విసిరినట్టు భలే హాయిగా వున్నింది రైతుకి.

కొంచేపు కాళ్ళు పిసికినాడు. దేవుడు కాళ్ళు పిసకతా వుంటే రైతుకి సగించినట్టు నిద్దర పట్టేసింది.

గాలిలేక మల్లా ఎక్కడ మెలుకువస్తుందోనని తొలికోడి కూసేంతవరకు నిద్దరపోకుండా విసనకఱ్ఱతో విసరతానే వున్నేడు దేవుడు.

''అందుకని పెదబ్బా రైతుపుట్టక పుట్టినాక సోమరిగా వుండగూడదు. కష్టం చెయ్యల్ల. చెయ్యలేదనుకో దేవుడు చెలాకోడి ఎత్తుకోనొచ్చి వాంచేస్తాడు'' అని చెప్పింది చిన్నవ్వ.

ఆ మాటతో పెదబ్బకి కొంచెం భయమేసింది.

తొలకి చేతపట్టినోడు దించనేలేదు. పొద్దుగూకేంతవరకు చెనిగిచెట్లు తవ్వతానే వున్నేడు.

చెనిగి చెట్లల్లో గడ్డి తొవ్వతా తొవ్వతానే నారవాకులు కోసి ఇస్తళ్ళు కుట్టింది చిన్నవ్వ. పెదబ్బ వాళ్ళమ్మ పైటేల సంగటి తెస్తే ఆ ఇస్తరాకుల్లోనే తిన్నేరు.

చెనిగి చెట్లల్లో గడ్డి తొవ్వతా తొవ్వతానే మంగళ గుట్టంతా తిరిగి తిరిగి తౌనికాకులు కోసింది. వాటిని ఎండ బెట్టి కట్టలు కట్టింది. గొడ్లకి రెండు మోపుల గడ్డి కోసింది. రెండు మోపుల కట్టెలు కొట్టింది. కట్టెలు కొడతా వుంటే కాళ్ళో ముల్లిరిగింది. అయినా పట్టించుకోలేదు.

చెనిగి చెట్లల్లో గడ్డి తొవ్వతా తొవ్వతానే మంగళ గుట్టంతా తిరిగి తిరిగి తౌనికాకులు కోసింది. వాటిని ఎండబెట్టి కట్టలు కట్టింది. గొడ్లకి రెండు మోపుల గడ్డి కోసింది. రెండు మోపుల కట్టెలు కొట్టింది. కట్టెలు కొడతా వుంటే కాళ్ళో ముల్లిరిగింది. అయినా పట్టించుకోలేదు.

పనిమింద పని చేస్తానే వున్నింది.

చెనిగి చెట్లల్లో గెడ్డి తొవ్వతా తొవ్వతానే సీతాఫలం చెట్లల్లో దూరి పిల్లోల్లకి చెట్టు పండ్లు కోసిచ్చింది.

జీరంగి మాదిరి తిరగాడతా. పనిచేస్తా వుంటే పొద్దుగూకేది గూడా తెలీలేదు.

చీకట్లు ముసురుకుంటా వుంటే తలెత్తి చూసింది చిన్నవ్వ.

''ఇప్పుడేగదా పొద్దు మొలిచింది. అప్పుడే పొద్దుగూకిందా? నీయమ్మా నాయాలి పొద్దా. ఎందుకే నీకంత తొందర? ఇంగ రొంతసేపు పొద్దుగూకకుండా వున్నుంటే ఇంగ రెండుసాల్లు గెడ్డి తవ్వకోని వుందుగదా!'' అని యాష్టపొయింది.

''పొమ్మో.. సాలుగాని! నీకత నాకు తెలీదా ఏందీ? ఇంగా రెండుసాల్లు తవ్వకోనే దాకా వున్నేననుకో, ఇంకా రెండుసాల్లు తవ్వకోనేదాకా వుండగూడదా అని మూతి సింగిలించుకుంటావు. నీకు తృప్తి ఎక్కడిది తల్లే?'' అని పొద్దుగూట్లో వాలిపొయింది.

ఆపాట్నే ఏం చేసిందంటే? కాళ్ళో ముల్లిరిగి నొప్పి పెడతా వున్నింది గదా! కుంటతానే రెండు మోపుల గడ్డినీ, రెండు మోపుల కట్టెల్నీ, తౌనికాకుల మూటనీ ఇంటికి చేర్చింది.

దీపాలు ముట్టించింది కల్లేణమ్మ.

కుంటతా కుంటతానే గొడ్లకు గడ్డేసింది చిన్నవ్వ. పెద్దావు ముందు కుర్చోని పిదుదులు పిండింది.

కుంటతా కుంటతానే మల్లా చేదబాయి కాడికి పొయ్యి నీళ్ళు తెచ్చింది. బోకులు కడిగింది. రేపటికి కూరకి అలసందకాయలు వొలిసింది. పొద్దన్నే వుప్పిండికని బియ్యం నూక ఇసిరిపెట్టింది.

అన్నాలు తినేసి తీరిగ్గా కుంటుకుంటా సక్కుపిన్నమ్మ దెగ్గిరికి పొయింది. చుట్టుపక్కల పల్లెల్లో పేరు మోసిన ముండ్ల డాక్టర్ సక్కు పిన్నమ్మ. ఎలాంటి మొండి ముల్లునైనా సరే కంట్లో నలుసుని తీసినంత అలాగ్గా నొప్పి తెలీకుండా కాళ్ళో ముల్లుని కుట్టేసేది.

''మ్మేయ్ సక్కూ... కాళ్ళో ముల్లిరిగింది. కొంచెం కుట్టవా?'' అని కాలుని సాపింది.

''ఇప్పుడు తీరిక దొరికిందా నీకు. ముల్లు కుట్టుకునేదానికి. నాకు రేచీకటి తల్లే! కనపడదు. పొద్దన్నే రాపోమా కుట్టేస్తాను'' అనింది సక్కు పిన్నమ్మ.

ఇంగ ఏం చేసేదిలేక ఆ నొప్పితోనే వచ్చి పడుకునింది చిన్నవ్వ.

కాలు వూదిపొయ్యి సలపతా వున్నింది. నిద్దర పట్టక పడకమింద మెదలతా వున్నింది.

చిన్నవ్వ నీడదేవుని దెగ్గిరికి పొయింది.

''దేవరా దేవరా.. ! కట్టెలు కొడతా వుంటే చిన్నవ్వకి కాళ్ళో ముల్లిరిగింది. సలుపుకి అల్లాడతా నిద్దర గూడా పోలేదు'' అని చెప్పింది.

''అరెరే... నా కష్టజీవి కాళ్ళో ముల్లిరిగిందా!'' అని చెప్పేసి బాధపడతా దేవుడు పరిగెత్తుకుంటా వచ్చినాడు.

చిన్నవ్వ కాలుని తీసుకోని వొళ్ళో పెట్టుకోని ముల్లిరిగిన చోట ఎంగిలిపూసి, ఏమాత్తరం నొప్పి అనేది తెలీకుండా కంట్లో నలుసుని తీసినంత జాగర్తగా ముల్లు కుట్టినాడు దేవుడు.

చేత్తో తీసేసినట్టు నొప్పి తగ్గిపొయింది. వాపు గూడా తగ్గింది.

సగించినట్టు నిద్దర పట్టేసింది చిన్నవ్వకి.

పొద్దున్నే లేసి సక్కుపిన్నమ్మని అడిగింది చిన్నవ్వ.

''రేచీకటి అన్నేవు. నాకు తెలీకుండా ముల్లెప్పుడు కుట్టేసినావుమ్మే'' అని.

''నేనెక్కడ కుట్టినాను తల్లే!'' అనింది బిందెత్తుకోని నీళ్ళకుపోతా.

''నువ్వు కాకపోతే దేవుడొచ్చి కుట్టినాడా? నీ చేతి మహత్తెమేమోగాని ముల్లు కుట్టగానే చేత్తో తీసేసినట్టు నొప్పి తగ్గిపొయింది. వొళ్ళు మరిసి నిద్దరపొయినానుమ్మే'' అని చెప్పింది చిన్నవ్వ.

సక్కుపిన్నమ్మకు ఏం అర్తంగాలేదు. బుఱ్ఱ గోక్కునింది.

అని పకపకా నవ్వతా కత చెప్పింది బృందావన దీపం.

ఆ మాటకి మిగతా దీపాలు గూడా తలలాడిస్తా నవ్వినాయి. ★